క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

బేతంచెర్ల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం బేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. రైతులు వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారని వారి సమస్యలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. ప్రజలకు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ అమలు విధానంపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణికి అవగాహన కల్పించారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలి ఎంపిక



కోట్ల మహాలక్ష్మి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన కోట్ల మహాలక్ష్మి ఆశావర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. గత నెల 30, 31 తేదీల్లో వైఎస్సార్ జిల్లాలో ఏఐటీయూసీ అనుబంధం 3వ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా కోట్ల మహాలక్ష్మిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి తిరుమలేష్, ఆశావర్కర్లు వెంకటలక్ష్మి, పుష్పావతి, నాగేంద్రమ్మ, రమాదేవి, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ ఏడీ, ఏఈలకు సన్మానం



విద్యుత్ అధికారులను సన్మానిస్తున్న గణేష్ కేంద్ర ఉత్సవ సమితి సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలో వినాయక చవితి నిమజ్జనం రోజున లైటింగ్ ఏర్పాటు చేయడమే గాకుండా, ఎలాంటి సమస్య తలెత్తకుండా తమ సిబ్బందితో సేవలందించిన విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ శివను గణేష్ కేంద్ర ఉత్సవ సమితి సభ్యులు బుధవారం సన్మానించారు. అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం అయ్యాయని గణేష్ కేంద్ర ఉత్సవ సమితి సభ్యులు హుసేన్ రెడ్డి, మారుతి శర్మ, మురళీకృష్ణ, హరి, రమణ, బ్రహ్మం, సతీష్, లక్ష్మినారాయణ అన్నారు.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి

బేతంచెర్ల: విద్యార్థినులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి సూచించారు. యువజన సంక్షేమ అధికారి వేణుగోపాల్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణానికి సమీపాన ఉన్న కేజీబీవీలో ప్రిన్సిపాల్ అబీదాబేగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ మార్గదర్శక విషయాలపై సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి అవగాహన కల్పించారు. విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు గీత, శ్రీదేవి, వెంకట లక్ష్మి తదితరులు ఉన్నారు.

యూరియా కొరతపై 8న ఆందోళనలు



మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ టౌన్: రాష్ట్రంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై ఈ నెల 8వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా దొరక్క రూ.250 విలువైన బస్తాను బ్లాక్ మార్కెట్‌లో రూ.600 వరకు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులు యూరియాను అక్రమంగా తరలించి బినామీ రైతుల పేర్లతో దోపిడీ చేస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల, పట్టణ అధ్యక్షులు నారాయణ, మోటా రాముడు ఉన్నారు.

గణనాథా మన్నించు!



వెంకటాపురం పల్లె చెరువులో సగం మునిగి కనిపిస్తున్న గణేశుడి విగ్రహాలు



డోన్ టౌన్: ఐదు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలను నిమజ్జనం చేసిన తరువాత అక్కడి పరిస్థితులు, కనబడుతున్న దృశ్యాలను చూసి నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. గత ఆగస్టు 27వ తేదీ వినాయక చివితి ఉత్సవాలు ప్రారంభంకాగా వాడవాడలా గణేశుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఐదు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించి 31వ తేదీన ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని వెంకటాపురం పల్లె చెరువులో నిమజ్జనం చేశారు. అయితే విగ్రహాలను సరైన లోతు వరకు తీసుకెళ్లకపోవడంతో నేటికీ ఆ ప్రాంతంలో విగ్రహాలు సగం మునిగి కనిపిస్తుండటంతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. అంతేగాకుండా చెరువు ప్రాంతంలోని వ్యర్థాలను కమిటీ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో నీటిలో కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది.

కేంద్రీయ విద్యాలయంలో వసతులు కల్పిస్తాం



కేంద్రీయ విద్యాలయం ఆవరణలో పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రారంభమవుతున్న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆయన బుధవారం కేంద్రీయ విద్యాలయాన్ని ప్రిన్సిపాల్ మాలిక్, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాలయం ఆవరణ నుంచి రైతుమిత్ర కాలనీ వైపు గేటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులు ఇప్పటికే కల్పించామన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి ఎలాంటి సహాయం చేయడానికైనా మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

భూముల వివరాలు ఇవ్వండి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

బేతంచెర్ల: ఏకోరన్ సంస్థ ఆధ్వర్యంలో గాలి మరలు ఏర్పాటు చేస్తున్నారని, భూములు కోల్పోయే రైతులు పొలం పాస్‌బుక్, పట్టా వివరాలను అందజేయాలని ఆర్డీఓ నరసింహులు కోరారు. బుధవారం మండలంలోని కొలుముల పల్లె, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్ల నుంచి భూములు సాగు చేసుకుంటున్నామని, తమ వద్ద పాస్‌బుక్‌లు, పట్టాలు లేవని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రికార్డులు సక్రమంగా కలిగిన రైతులకు నష్ట పరిహారం అందిస్తామని, భూమి సాగులో ఉండి రికార్డులు లేని రైతుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ నాగమణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బార్ దరఖాస్తులకు స్పందన కరువు

డోన్ టౌన్: పట్టణంలో మద్యం సరఫరా బార్‌లు ఏర్పాటు చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ పట్టణానికి జనరల్ కేటగిరీలో ఒకటి, గీత కార్మికుల కోటాలో మరోకటి కలిపి రెండు బార్‌లకు గతంలో ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ప్రభుత్వం, జిల్లా అధికారుల అదేశాల మేరకు రీ–నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఈ నెల 3 నుంచి 14వ తేదీ లోపు నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు చెల్లించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 15న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో బార్‌లను కేటాయించి మూడేళ్ల కాల పరిమితితో అనుమతులు మంజూరు చేస్తారని వెల్లడించారు. వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మల్లగుల్లాలు పడుతున్న సిబ్బంది

డోన్ పట్టణంలో బార్‌లు ఏర్పాటు చేసుకొనేందుకు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో వారు డోన్ అధికారులపై మరింత ఓత్తిడి తెచ్చారు. దీంతో ఆగస్టు 31వ తేదీ డోన్ ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి బార్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచించారు. ఈ విషయంపై మద్యం షాపు యజమానులు మాట్లాడుతూ బార్ ఏర్పాటుకు చెల్లించాల్సిన దరావత్తు అధిక మొత్తంలో ఉందని ఈ ధరలు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని, ప్రస్తుతం పర్మిట్ రూంలకు, అధికార పక్షం ప్రతినిధులకు నెల నెలా మామూళ్లు చెల్లించడానికి గిట్టుబాటు కావడం లేదని వాపోయినట్లు సమాచారం. ప్యాపిలి మండలంలో ఎంఆర్‌పీ కంటే అధిక రేటుకు మద్యం అమ్ముతున్న విషయాన్ని గుర్తు చేసి డోన్‌లో కూడా సిండికేట్‌గా ఏర్పడి రేట్లు పెంచి విక్రయించుకునేందుకు అవకాశం ఇస్తే ఆలోచిస్తామని మద్యం షాపుల యజమానులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

డోన్ టౌన్: ఔత్సాహికులు పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఆర్థికంగా ఎదగడంతో పాటు ఇతరులకు పని కల్పించిన వారవుతారని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మహబూబ్ బాషా అన్నారు. స్థానిక జాడీల ఫ్యాక్టరీ ఆవరణలోని పరిశ్రమల కార్యాలయంలో బుధవారం నూతన పరిశ్రమలు స్థాపించే వారికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయనతో పాటు డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, ఏపీఎం బాబురావు హాజరై పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పత్రాలు, అనుమతులు, బ్యాంకు లోన్లు, అవకాశాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం రిజిస్ట్రేషన్, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, రాయితీల గురించి వివరించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కన్సల్టెన్సీ హెడ్ కృష్ణమూర్తి, డోన్ పరిశ్రమల శాఖ అధికారి శివప్రసాద్, ఏపీఎంలు, సీసీలతో పాటు పారిశ్రామికవేత్తలు సత్యంగౌడ్, మల్లయ్య, మిట్టా రవికుమార్, గౌస్, ప్రతాప్‌రెడ్డి, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే



తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లే రహదారి దుస్థితి

పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు సబ్ ట్రెజరీ కార్యాలయం వెళ్లేదారి గుంతలు పడటంతో పాటు చినుకు పడితే బురద మయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై మండల తహసీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయానికి పని నిమిత్తం ప్రజలతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు నిత్యం వెళ్తుంటారు. ఈ రోడ్డు మట్టి రోడ్డు కావడంతో కొద్ది పాటి వర్షం కురిసినా గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండి రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతోంది. దీంతో ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతు న్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోని రోడ్డుపై గుంతలు పూడ్చివేయాలని, వర్షపు నీరు నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–బనగానపల్లె రూరల్

రెండు రోజుల్లో యూరియా వచ్చే అవకాశం

అవుకు(కొలిమిగుండ్ల): యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులకు కొంత వరకు ఊరట కలుగనుంది. రెండు రోజుల్లో అవుకుకు యూరియా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. ఒడిస్సా నుంచి రావాల్సిన లోడ్ ఆలస్యం కావడంతో జాప్యం చోటు చేసుకుంది. గురువారం జిల్లా కేంద్రం నంద్యాలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి రైతు సేవా కేంద్రాలకు రానుంది. శుక్రవారం నుంచి రైతులకు యూరియా పంపిణీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి గాయాలు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సంజామల మండలం ఆకుమల్లకు చెందిన రమణారెడ్డి పని నిమిత్తం బైక్‌లో తల్లితో పాటు బనగానపల్లెకు బయలుదేరాడు. పోలీస్ స్టేషన్ దాటాక ఎదురుగా వస్తున్న మినీ వాహనం ఢీకొనడంతో ఇద్దరూ కింద పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు,పోలీసుల సహకారంతో క్షతగాత్రులను చికిత్స కోసం నంద్యాలకు తరలించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్యాపిలి: పట్టణంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి గార్లదిన్నె మహేశ్, పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్ వాపోయారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలో వాహనాలు అతివేగంతో వెళ్తున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలో రియలన్స్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న బైకును వెనుక వస్తున్న లారీ ఢీకొనడంతో శ్రీరాములు, విష్ణువర్ధన్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. వివరాలు.. ప్యాపిలి మండలం పెద్దపూదిళ్ల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపూజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరైన లక్ష్మీ ప్రసాద్ భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకవచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువు శ్రీరాములు స్నేహితుడు విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి బైకుపై డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి భౌతిక కాయాన్ని సందర్శించి తిరిగి వెళ్తుండగా లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డారు. ఈ సమయంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును డ్రైవర్ చాకచక్యంగా అదుపుచేయడంతో మరో ఘోర ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.


మిలాద్-ఉన్-నబీకి ముస్తాబు

బేతంచెర్ల : పట్టణంలోని జెండాపేట కాలనీలోని మసీదు వద్ద నుంచి మెయిన్ బజారు మీదుగా ప్రధాన రహదారి వరకు మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకొని విద్యుత్ కాంతులతో అలంకరించారు. మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకొని బుధవారం రాత్రి గంధం సమర్పించారు. గురువారం ఉదయం 9గంటలకు ర్యాలీ, రాత్రి ప్రవక్త జీవిత చరిత్ర గురించి గొప్ప ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు మండల ఖాజీ నూర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆసార్ షరీఫ్‌లో ప్రవక్త కేశాలను ప్రజల దర్శనం ఉంచడం జరుగుతుందన్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.



బేతంచెర్ల లో విద్యుత్ కాంతులతో జెండా పేట మసీదు

కొండల్లో జలధార



బనగానపల్లె రూరల్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని యాగంటి క్షేత్రంలో ఎత్తైన కొండల్లో నుంచి ఊట రూపంలో వస్తున్న జలధార భక్తులను కనువిందు చేస్తోంది. బుధవారం యాగంటి క్షేత్రంలో ఉన్న పెద్ద కోనేరును శుభ్రం చేసేందుకు ఆలయ అధికారులు కోనేరులోని నీటిని ఖాళీ చేశారు. దీంతో కొందరు భక్తులు సమీపంలో కొండల్లో నుంచి ఊట రూపంలో వస్తున్న నీటి జలధార వద్దకు వెళ్లి స్నానాలు చేస్తూ ఆనందపారవశ్యానికి లోనయ్యారు. వర్షాకాలం మాత్రమే ఈ జలధార ప్రవహించడం విశేషం.

జలధార కింద స్నానం చేస్తున్న భక్తుడు

యాగంటి ఆలయానికి రూ.23.40 లక్షల ఆదాయం



వేలాలు నిర్వహిస్తున్న ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రం శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆవరణలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా ఆలయానికి రూ.23,40,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఇందులో టెంకాయలు విక్రయించుకునే హక్కును పాతపాడు గ్రామానికి చెందిన యాగంటి రూ.13.40లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును యాగంటిపల్లెకు చెందిన మద్దిలేటి రూ.3.05 లక్షలు, బొమ్మలు, పండ్లు విక్రయించుకునే హక్కును మీరాపురం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి రూ.4.20లక్షలు, సామాన్లు భద్రపరచుకునే హక్కును కటికవానికుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు రూ.2.75లక్షలకు పాడి దక్కించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేష్ బాబు, ఆలయ అర్చకులు మహేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయరాం క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

డోన్ టౌన్: రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిపై టీడీపీ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు డిమాండ్ చేసారు. వారు బుధవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. గుత్తి, పామిడి మండలాల్లో ఏర్పాటవుతున్న సోలార్ విండ్ పవర్ ప్లాంట్లకు లీజు పద్ధతిలో వ్యవసాయ భూములు కేటాయించేలా అధికార పార్టీ నేతలు రైతలపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. భూ నిర్వాసితుల గ్రామాల్లో పరిశీలనకు వెళ్లిన ఏపీ రైతు సంఘం నాయకులను గుమ్మనూరు జయరాం ఫోన్‌లో అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన అధికార పక్షం నాయకులు పెట్టబడిదారులకు కొమ్ముకాయడం సిగ్గు చేటన్నారు. ఈలాంటి తాటాకు చప్పుడులకు భయపడేది లేదని రైతులకు న్యాయం జరిగే వరకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం అని స్పష్టం చేశారు.

జగదుర్తిలో దివ్యాంగుల పరికరాల తయారీ కేంద్రం

డోన్: ఉమ్మడి జిల్లాలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అవసరాన్ని గుర్తించి డోన్ మండలం జగదుర్తి గ్రామంలో సెక్రెడ్ యాక్షన్ ఫర్ చైల్డ్ రిహాబిలిటేషన్, ఎమాన్సిపేషన్ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పరికరాల తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు డైరెక్టర్ తిప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్లు, ఇతరత్రా ప్రమాదాల వల్ల అవయవాలు కోల్పోతున్న దివ్యాంగుల కోసం కృత్రిమ అవయవాలు, ఊంక కర్రలు వంటివి తయారు చేస్తారని చెప్పారు. పోలియో, జన్యుపరమైన వైకల్యం గల వ్యక్తుల కోసం క్యాలిఫర్స్ ఊత కర్రలు, బాడీ బ్రేసులతో పాటు వంకర పాదాలతో జన్మించిన వారికి ప్రత్యేకమైన చికిత్స చేయడమే కాక ప్లాస్టిక్ తొడుగులను కూడా తయారు చేసి ఇస్తామన్నారు. వివిధ రకాల పక్షవాతం సోకిన వ్యక్తులకు హ్యాండ్ స్టిక్స్, స్పెషల్ సీట్లు, స్టాండింగ్ ఫ్రేమ్ వంటి పరికరాల తయారీ, గ్రహణమొర్రి, జన్యుపరమైన లోపాలతో జన్మించిన పిల్లలకు ఫిజియోథెరపీతో పాటు వివిధ రకాల థెరపిస్టులు కూడా ఈ సంస్థలో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న కోరారు.

బెల్టుషాపుల జోరు!

సంజామల: కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టుషాపులను రద్దు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం సంజామలలో వైన్‌షాపులకు అనుమతి వచ్చినా.. గ్రామంలో మహిళల నుంచి వ్యతిరేకత రావడంతో ఆకుమల్ల గ్రామనికి వైన్‌షాపును బదిలీ చేశారు. పెద్ద గ్రామమైన సంజామలలో వైన్‌షాపు లేకపోవడంతో బెల్టుషాపులకు గిరాకీ పెరిగింది. సంజామలలో మూడు బెల్టు షాపులు నిర్వహిస్తు.. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. ఏకంగా బస్టాండ్ ఏరియాలోనే గదులను అద్దెకు తీసుకుని పోటాపోటీగా మద్యం విక్రయిస్తుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బస్టాండ్ సర్కిల్‌లోనే వైన్ షాప్ తరహాలో మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. దీంతో మందుబాబుల ఆగాడాలు పెరిగి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

క్వాటర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.40 వరకు అదనం

బెల్టుషాపు నిర్వహకులు ఒక క్వాటర్ బాటిల్‌కు ఎమ్మార్పీ పైన రూ.20 నుంచి రూ. 40 వరకు అదనంగా అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. పలువురు మద్యం ప్రియులు బెల్ట్‌షాపు నిర్వహకులను అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేస్తామని హెచ్చరించగా.. కింది నుంచి పైదాకా మామ్ముళ్లు వెళ్తున్నాయని బదులు ఇచ్చారనే విషయం చర్చనీయాంశమైంది. మండల కేంద్రంలో, ప్రత్యేకంగా బస్టాండ్ ఏరియాలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు కనపడడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు పెద్దెత్తున్న మాముళ్లు వెళ్తునాయనే ఆరోపణలు వినబడుతున్నాయి.

7న మద్దిలేటి స్వామి ఆలయం మూసివేత



మద్దిలేటి నరసింహస్వామి ఆలయం వ్యూ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని ఈ నెల 7వ తేదీ ఆదివారం చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేయనున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు బుధవారం తెలిపారు. మళ్లీ సోమవారం తెల్లవారు జామున 4:30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి స్వామి, అమ్మవార్ల ఆలయ సంప్రోక్షణ, పుణ్యాహవాచనం, అభిషేకాలు నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. భక్తులు గమనించాలని సూచించారు.

బనగానపల్లెకు ఎంపీడీఓ కావలెను!



బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయం

బనగానపల్లె : మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)లేక పోవడంతో వివిధ అవసరాల పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో పాటు సంబంధిత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన బీవీ రమణ గత నెల 31న పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ గావించి మూడు రోజులైనా ఆయన స్థానంలో నూతన ఎంపీడీఓ లేదా ఇన్‌చార్జ్ ఎంపీడీఓను గాని ఉన్నతాధికారులు నియమించలేదు. కార్యాలయంలో విధులు నిర్వహించే డిప్యూటీ ఎంపీడీఓ కూడ అనారోగ్య కారణాలతో ఈ నెల 1వ తేదీ నుంచి సెలవుల్లో వెళ్లారు. జిల్లాలోనే అతి పెద్ద మండలం బనగానపల్లెకు ఎంపీడీఓ లేక పోవడంతో మండలంలో ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలతో పాటు సిబ్బందిపై పర్యవేక్షణ లేదు. సంబందింత ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని నూతన ఎంపీడీఓ లేదా ఇన్‌చార్జ్ ఎంపీడీఓను గాని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.